
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 । కనిష్ఠం : 22.0



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ఊట్కూర్, ఫిబ్రవరి 8 : రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం నిడుగుర్తితండా వద్ద గురువారం చోటు చేసుకుంది. ఊట్కూర్ ఎస్ఐ గోకారి కథనం ప్రకారం.. నారాయణపేట మండలం అప్పంపల్లి గ్రామానికి చెందిన శివ(18) అనే విద్యార్థి గురువారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తూ నారాయణపేట నుంచి పెద్దజట్రం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శివ నారాయణపేటలో అక్క దగ్గరే ఉంటూ చదువుకుంటున్నాడు. శివ బావ మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అద్దె దుకాణాల లెక్క తేలేదెన్నడు?

- పాలమూరు పురపాలికలో పేరుకు పోయిన అద్దె బకాయిలు
- దశాబ్దకాలంగా ఎగవేస్తున్న వ్యాపారులు
- సబ్‌లీజు పేరుతో గలీజు దందాలు
- కొన్ని దుకాణాలు సీజ్..మరికొందరికి నోటీసులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8: స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీ అయిన పాలమూరు పురపాలికలో ఏళ్ల తరబడి అద్దె దుకాణాల బాగోతం ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది.. కొందరికి ఇవి ఏటీఎంలుగా మారగా మరికొందరికి మాత్రం ఉపాధిని చూపి స్తున్నాయి. మునిసిపాలిటీ ఆదాయానికి కోట్లల్లో గండిపడు తోంది. అద్దెదుకాణాలు ఎన్ని ఉన్నాయి? ఎన్ని వాడుకలో ఉన్నాయి? ఎంతమంది లీజుదారులు దుకాణాలు నడుపుతు న్నారు? ఎంతమంది సబ్‌లీజుకు ఇచ్చారు? పురపాలికకు నెలనెల ఎంత వసూలవుతోంది? ఎంత బకాయి ఉందనే వివరాలు కొన్నేళ్లుగా అధికారుల దగ్గర సరైన లెక్కలు లేక పోవడం గమనార్హం. లెక్కలు కొలిక్కి వచ్చేలోపు సంబంధిత అధికారి బదిలీ కావడం. కొత్త అధికారి వచ్చి మళ్లీ లెక్కలు తీయడం పరిపాటిగా జరిగేది. ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు అధికారులు బకాయిల లెక్కలు తీసినట్లుగా స్పష్టమవుతోంది. పురపాలిక పరిధిలోని 258 అద్దెదుకాణా లకు రూ.23.93 కోట్ల ఆదాయం రావాల్సి ఉందని అధికారులు తేల్చారు. ఇందులో 61 దుకాణాలు వివిధ కారణాల వల్ల మనుగడలో లేవని ఇందులో కొన్నింటిపై కోర్టు కేసులుండగా, కొందరు సొంతంగా తాళాలు వేసుకున్నారని, కొన్ని దుకాణాలను అధికారులే మూసి వేశారని, ఈ దుకాణాలపై రూ.7.11 కోట్ల బకాయి ఉన్నట్లు చూపించారు. ఇవి పోను మిగతా దుకాణాలపై రూ.16.82 కోట్లు రావాల్సి ఉండగా అందులో ఈ ఏడాది రూ.1.23 కోట్లు వసూలు(7.36 శాతం) కాగా ఇంకా రూ.15.58 కోట్ల అద్దె వసూలు కావాల్సి ఉంది. వీటిని బట్టే అద్దె వసూలులో మునిసిపల్ అధికారులు ఎంత మీనమేషాలు లెక్కిస్తున్నారో అర్థమవుతోంది. కొన్ని దుకాణాల అద్దె ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంది. రూ.50 లక్షల నుంచి కోటి వరకు పెండింగ్ ఉన్న దుకాణాలున్నాయి.కొందరు అధికారులు గతంలో అద్దె వసూలుకు వెళ్లి మామూళ్లకు ఆశపడి అద్దె వసూలు చేయకుండా వచ్చేవారు. మరికొందరు డబ్బులు తీసుకుని నకిలీ రశీదులు ఇచ్చిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం మార్చిలో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో బకాయిలు వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకువస్తుండటంతో యంత్రాంగం నెమ్మదిగా కదిలి వారికి నోటీసులు ఇవ్వడం, సీజ్ చేయడం చేస్తున్నారు.

బహిరంగ వేలం.. పైరవీలతో భారం

గడియారం చౌరస్తా, మార్కెట్‌రోడ్‌లో ఉన్న 53 దుకాణాల 30 ఏళ్ల లీజు గడువు ముగిసిపోయింది. 2015-16లో అప్పటి కమిషనర్ దేవ్‌సింగ్‌నాయక్ ఈ దుకాణాలకు బహిరంగవేలం నిర్వహించారు. సిట్టింగ్ వ్యాపారులే పోటాపోటీగా వేలం పాడి తిరిగి వాటిని దక్కించుకున్నారు. అప్పటిదాకా నెలకు రూ.7 వేల నుంచి రూ.12 వేల వరకు ఉన్న అద్దె బహిరంగ వేలంలో రూ.50-70 వేలు.. ఆపై లక్ష వరకు వేలం పాడి దుకాణాలను దక్కించుకున్నారు. కానీ నెలనెల అద్దె ఎలా చెల్లించాలని పైరవీలు సాగించారు. ఎట్టకేలకు స్థానిక నాయకుల ద్వారా అప్పటి పురపాలిక మంత్రి కేటీఆర్ చేత తాత్కాలికంగా నిలుపుదల చేయించుకున్నారు. అప్పటిదాకా చెల్లించిన అద్దెకు 300 శాతం పెంచి చెల్లించాలంటూ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. అంటే రూ.7 వేలు ఉంటే రూ.21 వేలు చెల్లించాలి. ఇలా ఇప్పటివరకు చెల్లిస్తూ వస్తున్నారు. అయితే వేలంపాటు పాడిన మొత్తం మాత్రం వారి పేరిట డ్యూ చూయిస్తూ రావడం వల్ల అది కాస్త కోట్లకు చేరింది. ఇప్పుడు వీరిపై ఉన్న బకాయి మొత్తం చెల్లించాలని ఒత్తిడి తెస్తుండటంతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఆశ్రయించారు. అధికారులతో చర్చించిన ఆయన ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో పరిశీలిద్దామని కొంత సమయం ఇవ్వాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా దుకాణాలను లీజు తీసుకున్న వారు మరికొందరికి సబ్‌లీజుకు ఇచ్చి గలీజు దందాకు తెరతీశారు. పలు దుకాణాలపై అసలు లీజుదారులెవరో తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు ప్రజాప్రతినిధులు కూడా ఇతరులకు అధిక మొత్తంలో అద్దెకు ఇచ్చి ఉపాధి పొందుతున్నారు. అద్దెల రూపంలోనే రూ.16 కోట్లు బకాయి ఉంటే పురపాలిక పురోగతి ఎలా సాధ్యమవుతుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



గడియారం చౌరస్తాలోని మునిసిపల్ అద్దె దుకాణాలు


తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. సమావేశానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వారిలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌లో పోస్టర్ వార్

- కందనూలు ఎంపీ టికెట్ కోసం పోటాపోటీగా యత్నాలు
- పార్లమెంట్ నియోజకవర్గంలో వెలసిన మల్లురవి, సంపత్‌కుమార్ బ్యానర్లు
- ఎంపీ టికెట్ కోసం 26 దరఖాస్తులు



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది కందనూలు కాంగ్రెస్‌లో ఎంపీ అభ్యర్థిత్వం కోసం పోటీ నెలకొంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేది తానంటే తానేనని బహిరంగంగా ప్రకటించడం రాజకీయ వర్గాల్లోనే కాక నియోజకవర్గ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పూజ సందర్భంగా ఇటీవల వచ్చిన ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లురవి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎస్సీ నియోజక వర్గం నుంచి పోటీ చేయబోయేది తానేనంటూ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఎంపీగా పోటీ చేయడానికే తాను అత్యంత ప్రాధాన్యతనిస్తానని ఇందుకు అవసరమైతే తన పదవికి రాజీనామా చేస్తానని కుండబద్దలు కొట్టారు. ఆయన అనుచరులు, అభిమానులు కూడా పార్లమెంట్ నియోజకవర్గంలోని వేర్వేరు చోట్ల సమావేశాలు నిర్వహించి మల్లు రవికే టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విన్నవించారు. ఈ క్రమంలో మల్లురవి మరో అడుగు ముందుకేసి పార్లమెంట్ నియో జకవర్గంలో గెలుపొందిన వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చం పేట, కల్వకుర్తి ఎమ్మెల్యేల సంపూర్ణ మద్దతు తనకే ఉందని పేర్కొన్నారు. ఆ దిశగా ఆ ఎమ్మెల్యేలు కూడా మల్లురవికే తమ సంపూర్ణ మద్దతు ఉందని ప్రకటించడం గమనార్హం. ఫిబ్రవరి 13వరకు గాంధీ భవన్‌లో ఎంపీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరగా నాగర్‌కర్నూల్ ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తూ 26మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మల్లురవి, మందాజగన్నాథ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పేర్లు ప్రధానంగా ఉన్నాయి. అధిష్ఠానం దరఖాస్తుల పరిశీలనలో ఉన్నప్పుడే నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో ఒక పక్క మల్లురవి, మరోపక్క సంపత్‌కుమార్ బ్యానర్లు దర్శనమివ్వడం హాట్ టాపిక్‌గా మారింది.

వివిధ రాజకీయ సమీకరణల దృష్ట్యా తనకే టికెట్ వస్తుందని సంపత్‌కుమార్ తన అనుచరుల వద్ద పేర్కొంటుండగా టికెట్ తనదేనన్న ధీమాలో మల్లురవి ఉన్నారు. అయితే పార్లమెంట్ మాజీ సభ్యుడు మందాజగన్నాథ్ కూడా తాను ఎంపీ టికెట్ రేసులో ఉన్నానని తనకు టికెట్ రావడం తథ్యమని అనుచరులతో చెబుతున్నట్లు సమాచారం.

హామీలను అమలు చేసి తీరుతాం

- పాలమూరు న్యాయ యాత్రలో మంత్రి పొంగులేటి

కొత్తకోట, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను బరాబర్ అమలు చేసి తీరుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర గురువారం కొత్తకోటలో కొనసాగింది. ఈ యాత్రకు ఆయన ముఖ్య అతిథులుగా వనపర్తి, జడ్చర్ల, మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, అనురుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. పట్టణంలో జరిగిన కర్నార్ మీటింగ్‌లో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు కరువు జిల్లాలో దివంగత రాజశేఖర్‌రెడ్డి ప్రాజెక్టులు ప్రారంభించి పూర్తి చేశారన్నారు. సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చాక కల్లబొల్లి మాటలతో అధికారం చేపట్టి పదేళ్ల పాలన సాగించిన కేసీఆర్ పాత పాజెక్టులకు రంగులు వేసి నీళ్ల చల్లుకోని ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో కృష్ణానది నీటిని ఎకరాకు అందించిన దఖలాలు లేవని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనను చూసిన కేసీఆర్ భవిష్యత్‌పై ఆశలు వదులుకొని కృష్ణ, శ్రీశైలం, నాగర్జునసాగర్ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించారని దుష్ప్రచారానికి తెరతీశాడని విమర్శించారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజల ముందు ఉంచామన్నారు. ఇక మిగిలిన మిషన్ భగీరథ, ధరణి పథకాల్లో జరిగిన మోసాలను శ్వేతపత్రం విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రూ.7 లక్షల కోట్లు అప్పు చేస్తే వాటిని తట్టుకొని చిత్తశుద్ధితో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ చెంపచెల్లుమనే విధంగా తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీశ్రీను, మండల అధ్యక్షుడు బీసుపల్లి యాదవ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయ యాత్రలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

గృహజ్యోతికి అడుగులు

- పేట జిల్లాలో 1.45 లక్షల విద్యుత్ కనెక్షన్లు
- వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు


విద్యుత్ మీటర్ వివరాలను సేకరిస్తున్న ఉద్యోగి

నారాయణపేట, ఫిబ్రవరి 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా గృహజ్యోతి పథకాన్ని అమలు చేసేందుకు అడుగులు వేస్తోంది. ఈ పథకానికి అర్హులను గుర్తించేందుకు విద్యుత్ శాఖ దృష్టి సారించింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 1.45 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఇంటింటికీ తిరుగుతూ మీటర్ల సర్వీస్ నంబర్లు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్లను సేకరిస్తూ నెల విద్యుత్ బిల్లింగ్‌ను ఇచ్చే హ్యాండ్ మిషన్లలో నమోదు చేస్తున్నారు. గృహ విద్యుత్ కనెక్షన్లు 70 శాతం వరకు ఉండడంతో 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే వారికి ఉచితంగా విద్యుత్ అందించి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇళ్లలో అద్దెకు ఉండే వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. రేషన్‌కార్డులో ఉన్న లబ్ధిదారుల్లో ఒకరికి మాత్రమే ఉచిత విద్యుత్ అందనుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఒక్కో ఇంట్లో అధికంగా మీటర్లు ఉన్నా రేషన్ కార్డు ఆధారంగా ఒకరు మాత్రమే అర్హులుగా గుర్తిస్తున్నారు. ఇళ్లలో అద్దె ఉంటున్న వారి రేషన్‌కార్డును పరిగణలోకి తీసుకుంటున్నారు. కమర్షియల్ కనెక్షన్లను పరిగణలోకి తీసుకోవడం లేదు. ఈనెల 15లోపు ఇంటింటికీ తిరిగి వివరాల సేకరణ పూర్తి చేయాలనే లక్ష్యంతో ట్రాన్స్‌కో అధికారులు నిమగ్నమయ్యారు. వచ్చేనెల ఉచిత విద్యుత్ అందే అవకాశముందని అధికారుల ద్వారా తెలిసింది. దీంతో నిరుపేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చేపల పెంపకానికి కృషి

- కోయిల్‌సాగర్, రామన్‌పాడ్ ప్రాజెక్టులను పరిశీలించిన మత్స్య సహకార శాఖ కమిషనర్ గోపి


రామన్‌పాడ్ ప్రాజెక్టు గురించి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర ఫిషరీస్ కమిషనర్ గోపి

దేవరకద్ర / మదనాపురం, ఫిబ్రవరి 8 : చేపల పెంపకానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మత్స్య సహకార కమిషనర్ గోపి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని రామన్‌పాడ్ ప్రాజెక్టును ఆయన పరిశీలించి మట్లాడారు. కోయిల్‌సాగర్‌లో కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేసి చేపలను పెంచాలన్నారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపలను పెంచాలంటే కనీసం ప్రాజెక్టు సామర్థ్యం 15 టీఎంసీల నీటినిల్వ ఉండాలని, కానీ కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 2.27 టీఎంసీలు ఉందని అన్నారు. కనుక చేపలను పెంచడం సాధ్యం కాదన్నారు. మదనాపురం మండలంలోని రామన్‌పాడు ప్రాజెక్టును పరిశీలించి ఆయన మాట్లాడారు. కోయిల్‌సాగర్, జూరాల, రామన్‌పాడు ప్రాజెక్టులను ఆక్వాహబ్ ఏర్పాటు కోసం పరిశీలించామన్నారు. పరిశ్రమ ఏర్పాటు కోసం 50 ఎకరాల భూమి అవసరం ఉంటుందని, పరిశ్రమ ఏర్పాటుతో ఐదు వేల మందికి ఉపాధి దొరుకుతుందని అన్నారు. చేపల విత్తన ఉత్పత్తి, దాణా ఉత్పత్తి, కేజ్ కల్చర్, చేపల ప్రాసెసింగ్ వంటివి చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్, ఇరిగేషన్ డిప్యూటీ సీఈ వెంకటరెడ్డి, ఈఈ జగన్మోహన్‌రెడ్డి, డీఈ విద్యాధర్, ఏఈ రనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

నెమలి వాహనంపై ఊరేగిన అభయుడు


నెమలి వాహనంపై ఊరేగుతున్న అభయుడు

ఊర్కొండ, ఫిబ్రవరి 8: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండ పేటలో కోరిన కోరికలు తీర్చు అభయాంజనేయుడి బ్రహ్మోత్స వాలు కనుల పండువగా జరుగుతున్నాయి. గురువారం ఆరవ రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు సుప్రభాత సేవ, మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు అర్చనలు, రాత్రి నెమలి వాహన సేవ, గ్రామ భజన మండలితో భజనలు గావించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ మాజీ చైర్మన్ బెక్కరి రాజశేఖర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు పాలక మండలి సభ్యులు నర్సిరెడ్డి ఆయనను శాలువాతో సన్మానించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మి, పాలకమండలి సభ్యులు మనోహర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, మల్లేష్‌యాదవ్, సువర్ణ మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు, అర్చకులు దత్తాత్రేయశర్మ, శ్రీనివాసశర్మ, ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పింఛన్‌దారులు

- గ్రామ కార్యదర్శితో వాగ్వాదం
- పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించిన వృద్ధులు, వితంతువులు



ధన్వాడలో రోడ్డుపై బైఠాయించిన వృద్ధులకు నచ్చజెపుతున్న పోలీసులు

ధన్వాడ, ఫిబ్రవరి 8 : మూడు నెలలుగా పింఛన్ డబ్బులు అందడం లేదని ఒకరు.. మూడు నెలలు దాటితే పింఛన్ బంద్ అవుతోందని కొందరు.. నా వేలి ముద్ర పడటం లేదు గ్రామ కార్యదర్శి వేలిముద్ర వేస్తేనే నాకు పింఛన్ డబ్బులు వస్తాయని మరి కొందరు.. ఇలా ఆసరా పింఛన్ లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్న వృద్ధులు విసుగు చెంది గురువారం నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రోడ్డెక్కి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇలా రోడ్డెక్కితే ప్రయాణికులకు ఇబ్బంది అవుతుందని వృద్ధులను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. అక్కడి నుంచి దగ్గరలో ఉన్న తపాలా కార్యాలయం ముందు బైఠాయించారు. అక్కడే ఉన్న గ్రామ కార్యదర్శి మహేష్‌తో గొడవకు దిగారు. ఏఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని ఆందోళన కారులను సముదాయించారు. మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, రెండు రోజుల్లో పింఛన్ ఇస్తామని చెప్పడంతో శాంతించారు.

పాలమూరు పురపాలికలో కుర్చీలాట

- ఈనెల 12న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- కాంగ్రెస్ నుంచి చైర్మన్‌గా ఆనంద్‌కుమార్‌గౌడ్.. తేలని వైస్ చైర్మన్
- బీఆర్‌ఎస్ నుంచి చైర్మన్‌గా వనజ, వైస్ చైర్మన్‌గా అనంతరెడ్డి



ఆనంద్‌కుమార్ గౌడ్ | వనజ | అనంతరెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8 : పాలమూరు పురపాలికలో చైర్మన్, వైస్‌చైర్మన్‌ల కోసం కుర్చీలాట సాగుతోంది. ఈనెల 12న ఎన్నిక జరగనుండటంతో పురరాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి చైర్మన్‌గా 21వ వార్డు కౌన్సిలర్ ఆనంద్‌కుమార్ గౌడ్‌ను ఆ పార్టీ ఖరారు చేయగా, వైస్ చైర్మన్ విషయంలో తర్జనభర్జన సాగుతోంది. ఇక బీఆర్‌ఎస్ ఇది వరకే 5వ వార్డు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్ వనజను చైర్మన్ అభ్యర్థిగా బరిలో దించాలని నిర్ణయించగా, గురువారం వైస్ చైర్మన్ అభ్యర్థిగా 20వ వార్డు కౌన్సిలర్ రావుల అనంతరెడ్డి పేరును ఖరారుచేసింది. బీఆర్‌ఎస్ పార్టీ తమ పార్టీ గుర్తుపై గెలు పొందిన 30 మంది కౌన్సిలర్లకు విప్ జారీ చేయనుంది. ఇప్పటికే విప్‌పై డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్యకు అథారిటీ ఇస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విప్‌లను సభ్యులకు జారీ చేస్తున్నారు. అవిశ్వాస తీర్మానం సమయంలో విప్ జారీ చేసిన బీఆర్‌ఎస్, చైర్మన్ ఎన్నికకు మరోసారి తమ పార్టీపై గెలుపొందిన సభ్యులకు విప్ జారీ చేయాలని నిర్ణయించింది. పార్టీ సూచించిన అభ్యర్థులకే ఓటు వేయాలని విప్ ద్వారా స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చైర్మన్ విషయంలో కాంగ్రెస్ పార్టీలో కాంగ్రెస్‌తో పాటు కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న బీఆర్‌ఎస్ చీలిక వర్గం, బీజేపీ, ఎంఐఎం పార్టీలలో స్పష్టత ఉన్నా వైస్ చైర్మన్ విషయంలో మాత్రం ఎటూ తేల్చుకోలేకపోతోంది. వైస్ చైర్మన్ కోసం ఆ పార్టీ మైనారిటీలకు అవకాశం ఇవ్వాలని దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. సదరు అభ్యర్థిని కాంగ్రెస్‌కు మద్దతిస్తున్న ఇతర పార్టీలు వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ పార్టీ మాత్రం ఆ వ్యక్తి మినహా మైనారిటీలలో ఎవరికిచ్చినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేస్తుండగా, సదరు వ్యక్తిని కాదని మైనారిటీలలో మరో వ్యక్తికి ఇస్తే ఆయనకు మద్దతుగా ఉన్న మైనారిటీ కౌన్సిలర్‌ల మద్దతు వచ్చే అవకాశం లేకపోవడంతో వైస్ చైర్మన్ విషయంలో కాంగ్రెస్‌కు తలనొప్పి తప్పడం లేదు. ఇదే అదనుగా తమకు అనుకూలంగా మారే అవకాశం లేకపోలేదని బీఆర్‌ఎస్ ధీమాలో ఉండగా, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున అందరి మద్దతుతో ఆమోదయోగ్యమైన వ్యక్తినే వైస్ చైర్మన్‌ను చేస్తారన్న ధీమాలో కాంగ్రెస్ ఉంది.

బైపాస్ రోడ్డు పనులు నిలిపివేయాలని రాస్తారోకో



జడ్చర్ల-కోదాడ ప్రధాన రాహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న భూనిర్వాసితులు

చారకొండ, ఫిబ్రవరి 8 : జడ్చర్ల-కోదాడ జాతీయ రాహదారి పనుల్లో భాగంగా చారకొండ మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వద్దకు చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే నిలుపుదల చేయాలని అంబేడ్కర్ చౌరస్తాలోని ప్రధాన రోడ్డుపై గురువారం ఇళ్లు, ఇంటి స్థలాలు, భూములు కోల్పోతున్న నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించారు. నిర్వాసితులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ కల్వకుర్తి నుంచి మల్లెపల్లి వరకు ఎన్ని మూలమలుపులున్నా వాటిని సరిచేయకుండా రోడ్డు పనులు చేపట్టారు. కేవలం మండల కేంద్రంలో రెండు మూలమలుపులు, ఒక బ్రిడ్జి వున్నాయనే సాకుతో బైపాస్ రోడ్డు పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని వాపోయారు. బైపాస్ రోడ్డు వల్ల నిరుపేదలకు చెందిన వారమే ఇళ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డు పనులను వెంటనే నిలిపివేసి ప్రస్తుతం ఉన్న రోడ్డును విస్తరిస్తే చారకొండ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్న నిర్వాసితులను ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు రాస్తారోకోను విరమింపజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గణేష్‌గౌడ్. ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, డాక్టర్ సత్యం, ఏసారపు అశోక్‌గౌడ్, గుండె శివగౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, శంకర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, సత్తార్, విష్ణు. కుకుడాల శ్రీనివాసులు. సాయిలు. భూనిర్వాసితులు, వ్యాపారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు లేగ దూడలు

ఉప్పునుంతల, ఫిబ్రవరి 8 : మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో పాడి రైతు వెల్గూరి యాదయ్యకు చెందిన ఆవు రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఈతలో ఆవు ఒకే దూడకు జన్మనిస్తుంది. కాగా గురువారం ఆవు రెండు దూడలకు జన్మనిచ్చింది. కానీ పయ్యాక రెండు లేగ దూడలు మృతి చెందిననట్లు రైతు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



పోలీస్ స్టేషన్‌లో ఉన్న ప్రేమ జంట

మిడ్జిల్, ఫిబ్రవరి 8 : తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట గురువారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గుండిక కృష్ణ కుమార్తె శిరీష, మిడ్జిల్ మండలం వెలుగొమ్ముల గ్రామానికి చెందిన జంగిలయ్య కుమారుడు శ్రీకాంత్ కొంత కాలంగా ప్రేమించుకున్నారని, కులాంతార వివాహానికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో బుధవారం వివాహం చేసుకొని గురువారం పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరు మేజర్లు కావడంతో వయస్సు ధ్రువ పత్రాలను పరిశీలించిన పోలీసులు, అమ్మాయి కుటుంబ సభ్యులకు సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



సత్యయ్య (ఫైల్)

హన్వాడ, ఫిబ్రవరి 8 : చేపల వేటకు వెళ్లి చెక్ డ్యాంలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని వేపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మధ్యాహ్నం వేపూర్ గ్రామానికి చెందిన షేక్‌పల్లి సత్యయ్య (40)గ్రామ శివారులో ఉన్న చెక్‌డ్యాంలో చేపలు పట్టాడు. మళ్లీ సాయంత్రం ఐదు గంటల సమయంలో బట్టల బయట వదిలి చేపల కోసం చెక్ డ్యాంలోకి దిగి మునిగిపోయాడు. పక్కనే ఉన్న మరో వ్యక్తి మునిగిపోయిన విషయాన్ని చుట్టు పక్కల వారికి చెప్పడంతో వారు వచ్చి వెతికారు. చెక్ డ్యాం లోతుగా ఉండడంతో ఎవరూ దిగలేదు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతను మద్యం సేవించేవాడని, మద్యం మత్తులో పడి మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సింగోటం రామన్న దారుణ హత్య



సింగోటం రామన్న (ఫైల్)

కొల్లాపూర్, ఫిబ్రవరి 8 : చిన్నతనంలోనే బతుకుదెరువు కోసం పట్నం వెళ్లి స్వతాహాగా జీవితంలో రాణించి పుట్టిన ఊరు పేరుతో ప్రసిద్ధిగాంచిన సింగోటం రామన్న(40) బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో దారుణహత్యకు గురయ్యారు. కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామానికి చెందిన సింగోటం రామన్న గత కొన్ని సంవత్సరాల క్రితం అబ్దుల్‌కలాం ఫౌండేషన్ ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజల కు స్వచ్ఛమైన తాగునీరందించాలనే సంకల్పంతో ఫౌండేషన్ ద్వారా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సేవ చేస్తూ నియోజకవర్గంలో ప్రజల మన్ననలు పొందారు. మరోవైపు ముదిరాజ్‌ల ఐక్యత కోరుతూ కొల్లాపూర్ నియోజక వర్గ కేంద్రంలో సభలు, సమావేశాలు నిర్వహించి ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం కోసం తాను పని చేస్తానని బాహాటంగానే ప్రకటించిన సింగోటం రామన్న గతేడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో చేరారు. బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు తరపున ప్రచారం చేశారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి యూసుఫ్‌గూడ లక్ష్మీనగర్ కాలనీలో సింగోటం రామన్న దారుణహత్యకు గురయ్యారని వార్తలు ప్రచారం కావడంతో ఆయన అభిమానులు, బీజేపీ కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి, కల్వకోల్ మీదుగా కొల్లాపూర్‌కు ఆయన భౌతికకాయంతో అభిమానులు ర్యాలీ నిర్వహించి స్వగ్రామమైన సింగోటం గ్రామానికి తెచ్చారు. గురువారం రాత్రి పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తా మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు అంతిమయాత్ర సాగింది. 400మంది దాకా పాల్గొన్నారు.

రామన్న మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

హైదరాబాద్ మహానగరంలో దారుణహత్యకు గురైన కొల్లాపూర్ మండల వాసి, బీజేపీ నాయకుడు సింగోటం రామన్న మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. సింగోటం రామన్న హత్యను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అబ్దుల్‌కలాం ఫౌండేషన్ పేరుతో బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన బీజేపీ నాయకుడు సింగోటం రామన్న మృతి బీజేపీకి తీరని లోటని పేర్కొన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నాయకుడి హత్య తీవ్ర అనుమానాలకు దారీ తీస్తుందని దీని వెనక రాజకీయ కోణం ఉంటే మాత్రం పోలీసులు ఉదాసీనంగా వదిలివేయకుండా న్యాయమైన విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎల్లేని డిమాండ్ చేశారు.

భర్త దాడిలో భార్య మృతి

గోపాల్‌పేట (ఏదుల), ఫిబ్రవరి 8 : భార్యాభర్తల ఘర్షణలో భార్య మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దబుది పర్వతాలుకు చెన్నమ్మ(30)తో పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అదే గ్రామంలో వారి సొంత పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. బుధవారం పర్వతాలు మద్యం తాగి వచ్చి భార్యతో ఘర్షణ పడ్డాడు. మాటామాట పెరిగి పర్వతాలు భార్యపై చేయి చేసుకున్నాడు. గాయాలతో భార్య అస్వస్థతకు గురైంది. అర్ధరాత్రి సమయంలో చెన్నమ్మ మృతి చెందింది. గురువారం తెల్లవారుజామున కాలనీవాసులకు, గ్రామస్థులకు తన భార్య నొప్పితో బాధపడుతూ పలకడం లేదని నమ్మబలికాడు. విషయం తెలుసుకున్న చెన్నమ్మ తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి మృతదేహంపై గాయాలు ఉండడంతో పర్వతాలును నిలదీశారు. నేనే కొట్టానని ఒప్పుకున్నాడు. చెన్నమ్మ తల్లిదండ్రులు పర్వతాలుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.

మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 8 : మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగి చిక్కొండ్ర బాలస్వామి(70) మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం...నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి దేశిటిక్యాల గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి దగ్గర వ్యవసాయ పని కోసం జీతం పనికి కుదిరాడు. గత నాలుగేళ్లుగా అతని దగ్గరే పని చేస్తున్న బాలస్వామి ఈ నెల 4న మద్యం తాగిన అతను మత్తులో క్రిమిసంహారక మందు తాగి పొలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ఇట్టి విషయాన్ని గుర్తించిన ప్రతాప్‌రెడ్డి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని పెద్ద కుమారుడు శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి నలుగురు కూతుర్లు ఉండగా అందరికీ వివాహాలు అయ్యాయి.

జనరల్ ఆసుపత్రిలో నాలుగు నెలల పసికందు మాయం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8 : నిత్యం వేలసంఖ్యలో పేషెంట్లు, వారి బంధువులు వచ్చే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద భద్రత గాలికొదిలారు. ఈ క్రమంలోనే ఆసుపత్రికి వచ్చిన నాలుగు నెలల పసికందు మాయం కావడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవు తున్నారు. ఆసుపత్రికి చిన్నలోపంతో పాపను తీసుకువస్తే పాపనే మాయమవడంతో వారి రోదన వర్ణనాతీతం. అడ్డాకుల మండలం కందూరుకు చెందిన బోయ అంజమ్మకు నాలుగునెలల క్రితం కూతురు జన్మించింది. పుట్టిన సమయంలో పాప కాళ్లు కొద్దిగా వంకరగా ఉండటంతో ఈనెల 6న ఆసుపత్రిలో చూయించేందుకు పాపను తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు మందులు రాసిచ్చారు. డబ్బులు లేకపోవడంతో ఆమె భర్త కూలీ పనిచేసేందుకు వెళ్లగా అంజమ్మ కూతురుతో ఆసుపత్రి ఓపీ వద్ద ఉండిపోయింది. అక్కడే పడుకోగా బుధవారం అర్ధరాత్రి తరువాత ఎవరో పాపను ఎత్తుకుని పోయారు. లేచేసరికి పాప కనిపించకపోవడంతో ఆసుపత్రి అంతా వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిఘా పటిష్టం

- వినియోగంలోకి మళ్లీ సీసీ కెమెరాలు
- ఎస్పీ సొంత ఖర్చులతో మరమ్మతులు
- రిపేర్లతోనైనా చోరీలకు అడ్డుకట్ట పడేనా



కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శ్రీకాంత్

గద్వాల క్రైం, ఫిబ్రవరి 8 : జోగుళాంబ గద్వాల జిల్లాలో నిఘా నేత్రాలు పనిచేయడం లేదు. కొంతకాలంగా ఇవి మరమ్మతుకు నోచుకోకపోవడంతో దొంగలకు బాసటగా నిలిచాయి. జిల్లాలో ఏ మూలన ఏ చిన్న చోరీ జరిగినా దానిని చేధించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమికను పోషించాయి. ప్రస్తుతం అవి పనిచేయకపోవడంతో చోరీ చేధనలో పోలీసులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఇదే అవకాశంగా భావించిన దొంగలు విచ్చలవిడిగా రాత్రీ, పగలు అని తేడా లేకుండా దొంగతనాలను చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. అయితే గత నాలుగురోజుల క్రితం వీటిని మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఎస్పీ ముందుకొచ్చారు. ఆయన తన స్వంత ఖర్చులతో సీసీ కెమెరాలను మరమ్మతు చేయించి దొంగతనాల చేధనకు కృషి చేస్తున్నారు.

జిల్లాలో 547 కెమెరాలు అందుబాటులో..

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 547 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇందులో గద్వాల జిల్లా కేంద్రంలోనే 170 సీసీ కెమెరాలు ఉండగా వీటిలో 102 కెమెరాలు ఇతరత్రా కారణాలతో కొంతకాలంగా పనిచేయకుండా ఉండేవి. దీంతో గద్వాల జిల్లా కేంద్రం దొంగతనాలకు అడ్డాగా మారింది. జిల్లా కేంద్రంలోనే గత కొంతకాలంగా ఎక్కువగా దొంగతనాలు జరుగుతూ బంగారు, వెండి, నగదు ఎక్కువగా చోరీ జరిగింది. అయితే సీసీ కెమెరాలు సరిగా అందుబాటులో లేకపోవడం, ఉన్నవి కూడా సరిగా పనిచేయకపోవడంతో దొంగతనాల చేధన కష్టతరంగా ఉండేది. దీంతో ఎస్పీ రితిరాజ్ తన స్వంత ఖర్చులతో జిల్లా కేంద్రంలోని 102 సీసీ కెమెరాలను ప్రత్యేక బృందాన్ని రప్పించి తిరిగి పునరుద్ధరించేలా చర్యలు చేపట్టింది. అంతే కాకుండా దొంగతనాలను సీసీ కెమెరాలతో గుర్తించడంతో సిద్ధహస్తులుగా ఉన్న చంద్రయ్య రామకృష్ణలు గతంలో ఎస్పీ కార్యాలయంలో ఉండేవారు. కానీ ఎస్పీ రితిరాజ్ వచ్చాక దొంగతనాల విషయంలో వెంటనే నేరస్తులను గుర్తించేలా వారిని మళ్లీ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పంపించారు. అలాగే నేను సైతం కార్యక్రమం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేయాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు.

ఎమ్మెల్యే నిధులు విడుదలయ్యేనా?

నేరాల అదుపునకు కీలక పాత్ర పోషిస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన నియోజకవర్గ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేశారు. అయితే చివరి నిమిషంలో మంజూరు కావల్సిన రూ.50 లక్షలు ఎన్నికల కోడ్‌తో నిలిపివేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన మంజూరు చేసిన నిధులు పోలీస్ అధికారులకు అందుతాయా, లేదా వేసి చూడాల్సిందే.

దొంగతనాల నివారణకు పూర్తి స్థాయిలో కృషి చేద్దాం



జిల్లాలో గత కొంత కాలంగా దొంగ త నాలు ఎక్కువగా జరిగాయి. వీటిలో కొన్ని దొంగతనాలను సాంకేతిక కారణాలతో పట్టుకున్నాం. అయితే జిల్లా కేంద్రంలో ఎక్కువగా సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో వాటిని ప్రత్యేక బృందం రప్పించి తిరిగి పునరుద్ధరించాం. దొంగతనాల నివారణకు ఎల్లవేళలా కృషి చేస్తాం. పోలీసు నిఘా ఉంచి రాత్రివేళల్లో గస్తీని ముమ్మరం చేసి దొంగతనాల నివారణను అరికట్టేలా చర్యలు చేపడుతాం. అలాగే గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. దొంగతనాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలి.

- రితిరాజ్, జిల్లా ఎస్పీ

నేటి నుంచి చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, మునిసిపల్ అధికారులు
- పట్టణమంతా విద్యుద్దీపాల అలంకరణ, మైకుల ఏర్పాటు
- ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీస్ శాఖ



విద్యుద్దీపాల వెలుగులో చౌడేశ్వరీదేవి ఆలయం

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 8 : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో శుక్రవారం నుంచి చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు తొమ్మిదో తేదీన వేణుగోపాల స్వామి ఊరేగింపు, 10న కృష్ణానదిలో చౌడేశ్వరీదేవి గంగాస్నానం, అదేరోజు రాత్రి చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ, జ్యోతుల ఊరేగింపు, ఆదివారం ఉదయం నుంచి సోమవారం వరకు చిన్నచౌడేశ్వరి ఆలయం వద్ద భక్తులకు అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. వారంరోజుల పాటు జాతర కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. జాతర సందర్భంగా పట్టణంలోని ప్రతీ ఇంట్లో భక్తి కార్యక్రమాలు చేపట్టనున్నారు. జాతరలో వనపర్తి-పెబ్బేరు రహదారి ఇరువైపులా ప్లాస్టిక్ అంగళ్లు, లేడీస్‌కార్నర్లు, స్వీట్ దుకాణాలు, ఆటబొమ్మల షాపులు, పిల్లల సరదా కోసం రంగుల రాట్నం తదితర షాపులు వెలిశాయి. జాతర సందర్భంగా పట్టణంలో విద్యుత్ దీపాలంకరణ, మైకులు తదితర ఏర్పాట్లు ఆలయ కమిటీ చేస్తుండగా, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ రహదారిని ఏర్పాటు చేయించారు. ఎస్సీ కాలనీ జూరాల కాల్వ వద్ద వనపర్తి-పెబ్బేరు వాహనాల రాకపోకలు కొనసాగేలా ఏర్పాట్లు చేశారు. జూరాల కాల్వ వద్ద మునిసిపాలిటి వారు ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు నిర్మించారు. మొర్రంతో మట్టి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పాటు పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్, పోలీసు బందోబస్తు జరుగుతుంది. చౌడేశ్వరి జాతరకు వచ్చే భక్తులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. జాతర సందర్భంగా పెబ్బేరు పట్టణంలో క్రికెట్, కబడ్డీ పోటీలు, డ్రామాలు, డ్యాన్స్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

11న గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష

- పరీక్ష రాయనున్న 3,771 మంది విద్యార్థులు
- పది పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు
- ఆదేశించిన అదనపు కలెక్టర్ మోహన్‌రావు



మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) ఫిబ్రవరి 8 : సాంఘిక సంక్షేమ, ట్రైబల్, జనరల్, బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి ఈ నెల 11న గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు చెప్పారు. ఇందుకు గాను మహబూబ్‌నగర్ జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై గురువారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష నిర్వహణ కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ల సమీక్ష సమావేశంలో పలు సూచనలతో పాటు వారి బాధ్యతలను వివరించారు. ఆ రోజు పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఉంటుందన్నారు. విద్యార్థులు మాత్రం ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, అందుకు పిల్లలను వారి తల్లిదండ్రులు సన్నద్ధం చేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ పరీక్షకు 3,771 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. జిల్లా సమన్వయ అధికారి ఉప్పలవాణి, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు హాజరయ్యారు.

● మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు పీటీజీ గురుకుల విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరం ఐదోతరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఈ నెల 11(ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు పీటీజీ ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి తెలిపారు. విద్యార్థులకు పరీక్ష రాసేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. కేంద్రంలో 380 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకే పీటీజీ గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి హాజరై హాల్ టికెట్ నంబర్లను సరి చూసుకోవాలని, విద్యార్థులు నలుపు, నీలం పెన్నులు, ప్యాడ్, హాల్ టికెట్, ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

కొత్త చిన్నకిష్టారెడ్డి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం

- నక్కలపల్లి గ్రామ సభలో చాడ వెంకట్‌రెడ్డి



స్థూప ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 8 : సీపీఐ జిల్లా సీని యర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, అమరజీవి కొత్త చిన్న కిష్టారెడ్డి జీవితం భవిష్యత్తు తరాలకు ఆదర్శమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో అమరజీవి కొత్త చిన్నకిష్టారెడ్డి స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ పల్లెల్లో జరిగినటువంటి అరాచకాలు, అణచివేత, వెట్టి చా కిరీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధు డు కొత్తచిన్న కిష్టారెడ్డి అన్నారు. స్వాతంత్ర భార తదేశంలో తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేయా లని నైజాం, రజాకార్ల రాక్షస ప్రభుత్వాన్ని గద్దెదిం చాలని కమ్యూనిస్టులు చేసిన మహత్తర పోరాట మన్నారు. ఆ పోరాటంలో అక్రమ కేసులు ఎదుర్కొ ని రజాకారు మిలటరీతో చిత్ర హింసలకు ఎదురై నా ఉద్యమానికి, పుట్టిన గడ్డకు ద్రోహం చేయకుండా భరించిన వ్యక్తి చిన్నకిష్టారెడ్డి అన్నారు. చిన్నకి ష్టారెడ్డి నక్కలపల్లి గ్రామంలో జన్మించడం గ్రామ ప్రజల అదృష్టమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.ఆ నంద్‌జీ, ఎస్‌ఎండీ.ఫయాజ్, సీపీ ఐ సీనియర్ నాయకులు జి.హుసేనయ్య, మండల కార్యదర్శి బి.శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.నరసింహ, విజేయుడు, చంద్రమౌళి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి మెట్టే నరసింహ, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు తుపాకుల వెంకటేశ్, జిల్లా నాయకులు మల్లయ్య, ఏఐ వైఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసులు, శివ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి, కొత్త చిన్నకిష్టారెడ్డి కుటుంబ సభ్యులు కొత్త కరుణాకర్ రెడ్డి, కొత్త సుదర్శన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సీపీఐ నక్కలపల్లి గ్రామ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్ల అందజేత

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 8 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణానికి చెందిన కొందరు తమ మొబైల్ ఫోన్లు పోయాయని పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని గురువారం బాధితులు సరిత, గంపశ్రీను, నవీన్‌లకు అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ మహేష్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్, ఫిబ్రవరి 8 : మండలంలోని వెలుగొమ్ముల గ్రామానికి చెందిన ఖాదర్(24) ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఖాదర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించేలోపు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. చుట్టు పక్కల వారు ఖాదర్ మృతదేహానికి ఉరితాడు తీసి కిందికి దింపి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఖాదర్ మృతికి పూర్తి వివరాలు తెలియరాలేదు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 8 : భార్యతో గొడవ పడి భర్త గడ్డం తిరుపతయ్య(51) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం..నాగర్‌కర్నూల్ మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన గడ్డం తిరుపతయ్య కుటుంబ సమస్యలతో భార్యతో గొడవ పడి ఇంటి తలుపులు మూసుకుని ఫ్యాన్‌కు ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య లక్ష్మమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉంది. కుమారుడు గడ్డం నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

అయిజ, ఫిబ్రవరి 8 : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం లింగాపురం గ్రామానికి చెందిన జమ్మన్నగౌడు, అయిజ మండలం దేవబండ గ్రామానికి చెందిన గోవిందుగౌడులు గురువారం ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా వస్తూ, అయిజ పర్దిపూర్ గ్రామాల మధ్యన ఢీకొన్నాయి. ప్రమాదంలో జమ్మన్నగౌడ్, గోవిందుగౌడ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగ్రాతులను ఆసుపత్రికి తరలించారు. జమ్మన్నగౌడ్ వద్ద రూ.30,500, గోవింద్‌గౌడ్ వద్ద రూ.80,000, అంబులెన్స్ పైలెట్ శ్రీధర్, టెక్నీషియన్ ఇస్రాయిల్ స్వాధీనం చేసుకొని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ విషయంపై విచారణ చేపట్టామని, ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఇసుక అక్రమ డంపు సీజ్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 8 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపూర్ గ్రామంలో దాదాపు 3200 ట్రాక్టర్ల అక్రమ ఇసుక డంపింగ్ సీజ్ చేసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్ గ్రామ పరిధిలో అక్రమ ఇసుకపై సమాచారం రావడంతో కలెక్టర్ ఆర్డీవోకు దాడులు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఆర్డీవో పద్మావతి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ దాడి చేసి దాదాపు 3200 ట్రాక్టర్ల ఇసుక డంపింగ్‌ను గుర్తించారు. గుర్తించిన ఇసుక మొత్తాన్ని సీజ్ చేసి డంపింగ్ చేసిన వారి ఆచూకీ కోసం పోలీసులు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక అక్రమ డంపింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గట్టు, ఫిబ్రవరి 8 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా చాగదోణకు చెందిన గుండ్ల నర్సింహులు గురువారం మల్లంపల్లి శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీస్ సిబ్బంది దివాకర్, నాగరాజు తనిఖీలు నిర్వహించారు. ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి, డ్రైవర్ గుండ్ల నర్సింహులును విచారించగా అనుమతి పత్రాలు చూపించలేదు. దీంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టపరంగా శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఇసుక అవసరమైన వారు సంబంధిత అధికారులతో అనుమతి పొందాక తీసుకెళ్లాలని, అనుమతి పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

వైద్యశాఖ ప్రక్షాళన

- విచ్చలవిడిగా అక్రమ డిప్యుటేషన్లు
- అన్ని డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ప్రభుత్వ నిర్ణయంతో యథాస్థానాలకు 145 మంది వైద్య ఉద్యోగులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఫిబ్రవరి 8 : జిల్లా వైద్యశాఖలో ప్రక్షాళన మొదలైంది. అక్రమంగా చేయించుకొని విధులు కొనసాగిస్తున్న వారి డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో దాదాపు 145 మంది వైద్య ఉద్యోగులు యథాస్థానాలకు వచ్చేశారు. గురువారం సాయంత్రం వరకు తమ అసలు స్థానంలో రిపోర్టు చేయాల్సి ఉన్నా కొంతమంది చేయలేదు. అంతేకాకుండా ఏళ్లతరబడి సీటుకు హత్తుక్కుపోయిన వారు సైతం వదిలిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా చోట్ల డిప్యుటేషన్‌పై ఉన్న వాళ్లు యథాస్థానాలకు రావడంతో అక్కడ అంతా ఖాళీ అయిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

విచ్చల విడిగా డిప్యుటేషన్లు..

జిల్లాలో అక్రమంగా చాలా మంది తమకు అనువైన స్థానాలకు డిప్యుటేషన్లు తెచ్చుకున్నారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో డిప్యుటేషన్లు తెచ్చుకున్న వారే చాలా మంది ఉన్నారు. అవసరం లేని చోట్లకు వారు డిప్యూటేషన్ తెచ్చుకున్నారు. జడ్చర్లలో కొత్తగా జిల్లా ఆసుపత్రిని ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వం క్యాడర్ స్ట్రెంత్‌ను ఇవ్వకపోయినా, అక్కడ పోస్టు లేకపోయినా దాదాపు 10 మంది వరకు డిప్యుటేషన్లు తెచ్చుకున్నారు. మరో తొమ్మిది మంది తమ పలుకుబడితో తెచ్చుకున్నారు. అదేవిధంగా బాలానగర్ ఆసుపత్రిలో కూడా అవసరం లేకపోయినా ఐదుగురు డిప్యుటేషన్ తెచ్చుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పోస్టింగ్ ఉండి డిప్యుటేషన్‌పై హైదరాబాద్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు డిప్యూటేషన్‌పై 15 మంది వెళ్లారు. ఇదిలా ఉండగా వైద్య, ఆరోగ్య శాఖలో సైతం పీహెచ్‌సీల నుంచి జిల్లా కార్యాలయానికి, ఇతర పీహెచ్‌సీలకు డిప్యుటేషన్లు తీసుకున్నారు. డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో సైతం హైదరాబాద్‌కు చెందిన వారు ఉండడంతో వారు తమకు దగ్గర అవుతుందని అక్కడికి డిప్యుటేషన్ తీసుకున్నారు.

డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు

జిల్లాలోని వైద్య శాఖలో ఉన్న అన్ని డిప్యుటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం సాయంత్రంలోగా తమ యథాస్థానాలలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 140 మంది వైద్య ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దయ్యాయి. ఇందులో కేవలం 20 నుంచి 30 మంది మాత్రమే రిపోర్టు చేశారు. ఇంకా 80 శాతం మంది రిపోర్టు చేయలేదు. ఇదిలా ఉండగా ఈ అక్రమ డిప్యుటేషన్లపై కొందరు ఉద్యోగులు దాదాపు 10 సంవత్సరాల నుంచి ఆ సీటును వదలకుండా ఉన్నారు. ప్రభు త్వ నిర్ణయంతో యథాస్థానాలకు వెళ్లడం విశేషం.

145 మంది డిప్యుటేషన్లు రద్దు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో 145 డిప్యుటేషన్లు రద్దయ్యాయి. ఇందులో వైద్య విధాన పరిషత్‌లోని జడ్చర్ల, బాలానగర్ ఆసుపత్రులలో 25 మంది ఉండగా ఇందులో ఇద్దరు డాక్టర్లు, ఏడుగురు స్టాఫ్ నర్సులు, ఐదుగురు హెడ్‌నర్సులు, ఇద్దరు నర్సింగ్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు-2, మిగతా పారామెడికల్ సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో 80 మంది ఉండగా అందులో 16 మంది డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఈవోలు, ఎంపీహెచ్‌ఎస్‌లు, హెల్త్ అసిస్టెంట్లు-35, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది-26, మిగతా ఇతరులు ఉన్నారు. దీంతో పాటు డీఎంఈ పరిధిలో 40 మంది ఉండగా అందులో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, హెడ్, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు ఉన్నారు.

పాలనపై సందిగ్ధం

డిప్యుటేషన్లు రద్దు చేయడంతో యథాస్థానాలకు ఉద్యోగులు వెళ్లిపోయారు. కొన్ని చోట్ల కేవలం డిప్యుటేషన్లపై పాలన కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోనుంది. ఉదాహరణకు తెలంగాణ హబ్‌లలో చాలా వరకు డిప్యుటేషన్లపై కొనసాగుతున్న వారు వెళ్లిపోవడంతో అక్కడ ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కొన్ని పీహెచ్‌సీలలో కూడా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది కూడా డిప్యుటేషన్‌పై కొనసాగుతుండడం వారు కూడా వెళ్లిపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది. ప్రభుత్వం ఈ డిప్యుటేషన్లపై ఏ నిర్ణయం తీసుకుంటుందో, పరిపాలన ఏ విధంగా కొనసాగుతుందోననే సందిగ్ధం నెలకొంది.

కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్న ప్రభుత్వ విధానాలు



మునిసిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కవితకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, మునిసిపల్ కార్మికులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 8 : కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కవితకు మునిసిపల్ కార్మికులతో కలిసి సమ్మె నోటీసు ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా డి.ఈశ్వర్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మునిసిపల్ కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా తయారయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో మునిసిపల్ ఉద్యోగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వెంకటరమణ, ప్రసాద్, రాము, రమణ, కార్మికులు చిరంజీవి, రామస్వామి, బాలస్వామి, లక్ష్మీ, మున్నయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

'అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల జీతాలు చెల్లించాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 8: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఏఎన్ఎంల జీతాలను వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో నుంచి కొనసాగుతున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఏఎన్ఎంలను జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ప్రస్తుత ఏజెన్సీలను తొలగించి నూతన ఏజెన్సీలను నియమించి ఏఎన్ఎంల జీతాలను సకాలంలో చెల్లించేలా ఏఐటీయూసీ నేతృత్వంలో ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మారేడు శివశంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నరసింహ, అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు పద్మ, శ్రీలత, వరలక్ష్మీ, రేణుకాదేవి, యశోద తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితాను విడుదల చేసిన తహసీల్దార్

చారకొండ, ఫిబ్రవరి 8: మండలంలోని 17 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఓటరు తుది జాబితాను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేసీ ప్రమీల విడుదల చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కేసీ ప్రమీల మాట్లాడుతూ ఓటరు జాబితాను పోలింగ్ బూత్ లెవల్ అధికారులకు అందజేయడం జరిగిందని అన్నారు. ఓటరు జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని చారకొండ మండలంలోని 11 గ్రామపంచాయతీలకు సంబంధించి 14, కల్వకుర్తి నియోజకవర్గంలోని 6 గ్రామపంచాయతీలకు సంబంధించి 7 పోలింగ్ కేంద్రాలు మొత్తం 21 కేంద్రాల్లోని ఓటరు తుది జాబితాను విడుదల చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, ఆర్ మహ్మద్ నబీ పాల్గొన్నారు.

మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 8 : మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనన్న భావనతో ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి గ్రామంలో హజ్రత్ ఖాజా బందేనవాజ్ 63వ ఉర్సు జాతరను ఆయన సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు గోలి శ్రీనివాస్‌రెడ్డిని పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్పన, కృష్ణయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎండి.ఖాజామైనోద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుభాష్, తలకొండపల్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ముత్యాలు, రమేష్, నరేష్, చీమల్ల సతీష్, సుమన్, గణేష్, కిశోర్, విష్ణు పాల్గొన్నారు.

గృహజ్యోతిని వినియోగించుకోవాలి

వంగూరు, ఫిబ్రవరి 8: ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ఇళ్ల యజమానులతో పాటు కిరాయిదారులకు వర్తింపజేస్తోందని ఈ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ శ్రీధర్‌శెట్టి అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపూర్, వంగూరు గ్రామాల్లో చేపడుతున్న సర్వేను శ్రీధర్ శెట్టి పరిశీలించారు. స్పాట్ బిల్లింగ్ యంత్రంలో గృహజ్యోతి లబ్ధిదారుల వివరాల సేకరణ సక్రమంగా చేపట్టాలన్నారు. విద్యుత్ మీటర్ లేని వారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఏఈ మేఘనాథ్ ఉన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



విద్యార్థులతో ప్రశ్నలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా విద్యాధికారి

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 8 : పదవ తరగతిలోని వివిధ సబ్జెక్టుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల తో వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వివిధ సబ్జె క్టుల టీచర్లతో ముఖాముఖి మాట్లాడి అనుమానాలను నివృత్తి చేశారు. పాఠశాల హెచ్ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు సాయిశంకర్, కే.దేవయ్య, మేరీ, సునీలా, జి.ప్రమీల, ఎండి.షాహీన్‌బేగం, శారదా, స్వాతి, వెంకటస్వామిగౌడ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

మన్ననూర్, ఫిబ్రవరి 8: మండలంలోని మాచారం గ్రామానికి చెందిన మద్దెల రామకృష్ణ అనే వ్యక్తి 2018లో మన్ననూరు నుంచి మద్దిమడుగు రహదారిపై ద్విచక్ర వాహనంపై పురుగుల గుట్ట వద్ద ప్రయాణిస్తున్న క్రమంలో జింక తగిలి గాయపడ్డాడు. కొన్ని రోజుల తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమ్రాబాద్ రేంజ్ పరిధిలో ప్రమాదం జరుగడంతో బాధిత కుటుంబ సభ్యులు అటవీ కార్యాలయంలో పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు విచారణ నిమిత్తం పరిహారం ఫైల్‌ను వైల్డ్‌లైఫ్‌కు పంపించారు. ఐదేళ్ల తర్వాత అటవీశాఖ ద్వారా రూ.5లక్షల చెక్కు మంజూరైంది. అమ్రాబాద్ మండలం మన్ననూరు అటవీ డివిజన్ కార్యాలయంలో మృతుడి భార్య పద్మమ్మకు ఆ చెక్కును డీఎఫ్‌వో రోహిత్ గోపిడి గురువారం అందజేశారు. ఎఫ్‌డీవో బత్తుల విశాల్, అమ్రాబాద్ రేంజ్ అధికారి ఆదిత్య పాల్గొన్నారు.

'శ్రీనివాస పద్మావతి కళాశాల గుర్తింపును రద్దు చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 8: ప్రాక్టికల్ పరీక్షల పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేసి విద్యార్థులకు డబ్బులు తిరిగి చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ పద్మావతి జూనియర్ కళాశాల యాజమాన్యంపై జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడుతూ ప్రాక్టికల్ పరీక్షల పేరుతో కళాశాల యాజమాన్యం ఒక్కో విద్యార్థి నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేసిందని పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వని విద్యార్థులను ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ చేస్తామని యాజమాన్యం బెదిరించడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా విద్యార్థులు డబ్బులు చెల్లింక తప్పలేదని వాపోయారు. దీనిపై ఇంటర్ నోడల్ అధికారి విచారణ జరిపించి వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కేవీపీఎస్ నాయకులు బక్క కృష్ణ, భీముడు, జమదగ్ని, అంజి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- జాతర్లలో ఇక సందడే సందడి

బిజినేపల్లి, ఫిబ్రవరి 8 : బిజినేపల్లి మండలంలోని ఆలయాల్లో బ్రహ్మోత్సవాల నిర్వహణకు వేళయింది. పాలెం వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలతో మొదలు నంది వడ్డెమాన్‌లోని చెన్నకేశవ స్వామి గుద్దులాటపిడి జాతరతో 3 నెలల పాటు సాగి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

చిన్న తిరుపతిగా పాలెం వెంకన్న స్వామికి ఖ్యాతి

అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ఉమ్మడి జిల్లాలో చిన్న తిరుపతిగా ఖ్యాతిని గడించింది. శ్రీశైలం వెళ్లే కర్ణాటక, ఇతర రాష్ట్ర వాసులు పాలెం వెంకన్న స్వామిని దర్శించుకుంటారు. ప్రతి యేటా మాగశుద్ధ విదియ నుంచి నవమి వరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘ శుద్ధ సప్తమి నాడు స్వామివారి రథోత్సవం (తేరు) వేలాది భక్తుల సమక్షంలో కనుల పండువగా చేపడుతారు. 15 రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వెంకన్న దర్శనానికి వచ్చే భక్తులకు వసతి గృహాలు, ఉచిత అన్నదానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిత్యం కొనసాగుతుంది.



ఆనందగిరి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం



నందివడ్డెమాన్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

పశువుల క్రయ విక్రయాలకు ప్రత్యేకత

కాకతీయుల కాలంలో బిజినేపల్లిలోని ఆనందగిరి కొండపై వెలిసిన వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రతి యేటా మాగశుద్ధ విదియ నుంచి నవమి వరకు నిర్వహిస్తారు. ఇక్కడ బ్రహ్మోత్సవాలు ముగిసిన మరో 15 రోజుల పాటు జాతర కొనసాగుతుంది. జాతర వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులు పశువుల క్రయ విక్రయాలు కొనసాగిస్తారు. అలాగే అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. జాతరలో చికెన్, మటన్ ముక్కలను సీకులకు పెట్టి కాల్చి అమ్మడం ప్రాచుర్యం పొందింది.

నారదగిరిపై పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

మండలంలోని వట్టెంలోని నారదగిరి లేదా మునుల గుట్టగా పిలుచుకునే నారదగిరి కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏటా ఫాల్గుణ మాసంలో చతుర్ధశి నాడు బ్రహ్మోత్సవాలు (జాతర) ప్రారంభమౌతాయి. ఫాల్గుణ దశమి వరకు నిర్వహిస్తారు. శాలివాహన శకం ప్రకారం 1801లో ఇక్కడ బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు తెలుస్తుంది. పది రోజుల పాటు జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఆలయంలో పూజలు చేస్తుండగా నారదుడు తంబూరాతో గానం చేస్తూ స్వామి వారిని కొలిచినట్లుగా మా పూర్వీకులు తెలిపారని లక్షణదాసు వంశస్థుడు ప్రస్తుత ఆలయ పూజారి సీతారాములు స్వామి వారి వృత్తాంతం వివరించారు.

మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

మండలంలోని మంగనూర్‌లో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు శివరాత్రి సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. మండలంలోని పాలెం, బిజినేపల్లి, వట్టెం, వడ్డెమాన్ గ్రామాల్లో వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండగా మంగనూర్‌లో మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ప్రత్యేకత. శివరాత్రి రోజు స్వామి వారి ఊరేగింపు, రథోత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలి వచ్చే భక్తుల మధ్య కనుల పండువగా నిర్వహిస్తారు.

సీతారాముల కల్యాణం

మండలంలోని గంగారం గ్రామంలోని సీతారాముల ఆలయాన్ని కూచకుళ్ల వంశీయులు ఐదు వందల సంవత్సరాల కిందట నిర్మించారు. ఆలయ గాలిగోపురాన్ని బానూరు బాల్ లింగయ్య కట్టించారు. ఏటా శ్రీరామనవమి నాడు మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.

సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా చేపడుతారు. ఈ ఉత్సవానికి గ్రామస్థులు దేశ విదేశాల్లో ఎక్కడ ఉన్నా గ్రామానికి చేరుకోవడం విశేషం.



పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయం

గుద్దులాట పిడి జాతరగా ప్రసిద్ధి

మండలంలోని నంది వడ్డెమాన్ (వర్ధమానపురం)లో కాకతీయుల కాలంలో కట్టించిన శివాలయంలో చెన్నకేశవ స్వామిని ప్రతిష్ఠించారు. ఏటా ఫాల్గుణ బహుళ సప్తమి నాటి నుంచి ఐదు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం, రథోత్సవం, ప్రభాతోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎక్కడా లేని విధంగా నంది వడ్డెమాన్ జాతరలో గ్రామస్థులు రెండు వర్గాలుగా చీలి మధ్యలో పిడి కట్టి తాడుకు ఇరువైపుల నుంచి కొట్టుకోవడం ప్రత్యేక ఆకర్షణ నిలుస్తుంది.

కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 8: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం తిమ్మాజిపేట మండలంలోని బుద్ధసముద్రంలో మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, ఏఈవో సాయిరాంతో కలిసి గ్రామసభను నిర్వహించి సమస్యలను గుర్తించి చర్చించారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించి రహదారులను ఊడ్చారు. చేగుంటలో ప్రత్యేక అధికారి తహసీల్దార్ జేకే.మోహన్ ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామసభ నిర్వహించి పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అదేవిధంగా గ్రామంలోని నర్సరీని పరిశీలించి నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. పుల్లగిరి, తిమ్మాజిపేట గ్రామాల్లో ప్రత్యేక అధికారిణి ఎంపీడీవో కరుణశ్రీ, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచిస్తూ ప్రజాప్రతినిధులతో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

చారకొండ: గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో వెంకటేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు శాంతిగుడెంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా పరిష్కరిస్తామని అన్నారు.

నర్సరీ పనులపై నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అనంతరం ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామస్థులు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, పంచాయతీ కార్యదర్శి గణేష్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయా పార్టీల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



చారకొండ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేష్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, ఫిబ్రవరి 8 : క్రమ శిక్షణతో సాధన చేస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోను రాణించాలని ఆయన సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో జరుగుతున్న ఫుట్‌బాల్ క్రీడాకారుల శిక్షణను మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం గురువారం సందర్శించారు. ఫుట్‌బాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్‌గౌడ్, కోచ్ వెంకట్, రాము, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఊర్కొండ ఎస్సైగా వీరబాబు

ఊర్కొండ, ఫిబ్రవరి 8: ఊర్కొండ ఎస్సైగా వీరబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై లెనిన్ ఉప్పునుంతలకు బదిలీపై వెళ్లగా అమ్రాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న వీరబాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, అదేవిధంగా ప్రజాసమస్యలను నేరుగా పరిష్కరిస్తామని తెలిపారు. సమస్యలను నేరుగా ప్రజలు వచ్చి తెలియజేయాలని కోరారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి, ఫిబ్రవరి 8 : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎంపీడీవో ఆంజనేయులు కోరారు. మండల పరిధిలోని ఎల్లికల్ గ్రామాన్ని ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఈజీఎస్ పనులను, నర్సరీని, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

వెల్దండ, ఫిబ్రవరి 8 : మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం ఎంపీటీసీ మోతీలాల్ నాయక్ ప్రారంభించారు. నాయకులు బాల్‌లక్ష్మయ్య, వెంకటయ్య గోపాల్‌నాయక్, జగన్, శ్రీశైలం, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

బీఎస్పీ సన్నాహక సమావేశం

కల్వకుర్తి, ఫిబ్రవరి 8 : కల్వకుర్తి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం బీఎస్పీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ ఎంపీ అభ్యర్థి గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని కోరారు. గణపురం కృష్ణ, జిల్లా ఇన్‌చార్జి యూసుఫ్, నాగన్న, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామస్వామి, అసెంబ్లీ ఇన్‌చార్జి ఎట్టి ఆంజనేయులు, అసెంబ్లీ అధ్యక్షుడు చందు, రేణుక, సృజన, శ్రీనివాస్‌యాదవ్, మండలాల అధ్యక్షులు అనిల్, కొండల్‌యాదవ్, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ

బిజినేపల్లి, ఫిబ్రవరి 8 : మండలంలోని వట్టెం, మంగనూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను నాగర్‌కర్నూల్ జిల్లా డీఆర్‌డీవో నరసింగరావు, ఎంపీడీవో కృష్ణయ్యలు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వట్టెంలో ఉపాధి కూలీలు చేస్తున్న ఫీడర్ ఛానల్ పనులను, మునగ తోట పనులను పరిశీలించి సూచనలు, సలహాలు చేశారు. అలాగే మంగనూర్ గ్రామంలోని బీసీ కాలనీలో సైడ్‌డ్రైన్ పూడిక తీత పనులను పరిశీలించి మురుగును ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నందున కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాన్నారు. పంచాయతీ కార్యదర్శి అతినారపు మల్లేష్, టీఏ రాజేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కొల్లాపూర్, ఫిబ్రవరి 8 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో కొనసాగుతున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం వార్డు కౌన్సిలర్ షేక్.రహీంపాష పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కొల్లాపూర్ మునిసిపల్ పరిధిలోని వార్డుల అభివృద్ధి కోసం మంజూరైన నిధులతో వార్డులల్లో సీసీ రోడ్లు, సైడ్‌డ్రైనేజీలు నిర్మించి ప్రజల అవస్థలను తీర్చుతున్నట్లు కౌన్సిలర్ షేక్.రహీంపాష తెలిపారు.

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత

వెల్దండ, ఫిబ్రవరి 8 : మండల పరిధిలోని కొట్ర జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం కేబీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. పదవతరగతిలో మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు 10వేలు, గ్రామస్థాయిలో నిలిచిన విద్యార్థులకు 5వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు ట్రస్టు చైర్మన్ డాక్టర్ మల్లేష్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, తావుర్యానాయక్, అల్లాజి తదితరులు ఉన్నారు.

రక్తదానం మానవత్వానికి ప్రతీక

- మోటివేషనర్ స్పీకర్ బ్రదర్ షఫీ

- హెల్తీ లైఫ్ మై బర్త్ రైట్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 8: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేసేందుకు ముందుకు రావడం మానవత్వానికి ప్రతీక అని ప్రముఖ మోటివేషనర్ స్పీకర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బ్రదర్ షఫీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శాలీఖాన్ వీధిలో హెల్తీ లైఫ్ మై బర్త్ రైట్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వ హించారు. సంస్థ వ్యవస్థాపకుడు ప్రకాష్‌శాస్త్రీతో కలిసి బ్రదర్ షఫీ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టకతోనే ఈ వ్యాధి బారిన పడే బాధితులకు ప్రతి నెలా రెండు సార్లు రక్తం మార్పిడి చేయాల్సి వస్తుందన్నారు. రక్తం సేకరించి వారికిఅండగా నిలిచేందుకు హెల్తీ లైఫ్ మై బర్త్ రైట్ సంస్థ ముందుకు రావ డం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవ స్థాపకుడు ప్రకాష్‌శాస్త్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిస్థితులపై తమ సంస్థ సర్వే నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు నవీన్‌కుమార్, చక్రధర్‌రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హబీబ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తైలి శ్రీనివాసులు, సీపీఐ నాయకుడు ఆ నంద్‌జీ, సంస్థ ప్రతినిధి ఫక్రుద్దీన్, అలీ మహ్మద్, పాష, అబ్దుల్ ఖాసీం, మొహమ్మద్, వీణ, మొహమ్మద్ దర్వేష్, జాఫర్, రియాజ్, ఎండీ రఫీ, ఆరీఫ్, అష్రఫ్, నిరంజన్, అన్వర్ అత్తారి, రమేష్ పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మోటివేషనర్ స్పీకర్ షఫీ

15 నుంచి సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 8 : గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను కొల్లాపూర్ పట్టణంలో ఈ నెల 15, 16, 17వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కొల్లాపూర్, కోడేరు మండలాల మాజీ జడ్పీటీసీ సభ్యులు మూడావత్ హనుమంతునాయక్, కేతావతర్ బచ్చిరామ్‌నాయక్‌లు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గిరిజన భవన్‌లో జరిగిన గిరిజన సంఘాల ముఖ్య నాయకులు, గిరిజన కార్యకర్తల సమావేశానికి హాజరైన మాజీ జడ్పీటీసీలు మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా క్రీడలు నిర్వహించి చివరి రోజు మహారాజ్ బోగుబండర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు హాజరవుతారని వారు పేర్కొన్నారు. అంతకుముందు సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాల స్థలాన్ని మునిసిపల్ కమిషనర్ సొంటె రాజయ్య పరిశీలించారు. బోడబండతండా, యంగంపల్లి, ఎర్రన్నబావి తండాల మాజీ సర్పంచ్‌లు గోపినాయక్, రామునాయక్, లచ్చిరామ్‌నాయక్, మారేడుమానుదిన్నె, యాపట్ల గ్రామాల మాజీ సర్పంచ్‌లు బాలునాయక్, సీతారాంనాయక్, ముక్కిడిగుండం, ఎంపీటీసీ భోజ్యానాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్, నాయకులు కేతావత్ శంకర్‌నాయక్, గోపాల్‌నాయక్, గోవిందునాయక్, హీన్యానాయక్, హనుమంతునాయక్, హరిలాల్‌నాయక్, మహేష్‌నాయక్ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

చారకొండ: గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బంజారాలు నివసించే హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ 108 అడుగుల విగ్రహాన్ని నిర్మించి ఆయన స్మృతివనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా క్లస్టర్‌కి కోటి రుపాయాలను కేటాయించి జిల్లా, మండల వ్యాప్తంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు.



సంతుసేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించిన గిరిజనులు

కేరళ ప్రభుత్వంపై మోదీ నిరంకుశ వైఖరి నశించాలి



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 8: కేరళ వామపక్ష ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరంకుశ వైఖరి నశించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేరళ ప్రభుత్వంపై మోదీ ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేరళ గవర్నర్‌ను అడ్డం పెట్టుకుని అక్కడి ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం విద్వేషపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మోదీ హటావో అనే నినాదంతో పని చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, కోశాధికారి అశోక్, సత్యనారాయణ, శివ, సురేష్, సుధాకర్, రాజు, ఆంజనేయులు, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పౌర సంబంధాల అధికారిగా కిరణ్‌కుమార్



నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 8: జిల్లా పౌర సంబంధాల అధికారి(డీపీఆర్‌వో)గా జువిశెట్టి కిరణ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అదనపు పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా పౌర సంబంధాల అధికారిగా నియమిస్తూ రాష్ట్ర పౌర సంబంధాల శాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీపీఆర్‌వో సీతారాం నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇప్పటి వరకు నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి డీపీఆర్‌వోగా పని చేసిన పి.సీతారాం బాధ్యతలను అప్పగించి జిల్లా ఇన్‌చార్జి బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. రిలీవ్ అయిన డీపీఆర్‌వో సీతారాంను కార్యాలయ సిబ్బంది శాలువా, పూల మొక్కలతో సత్కరించారు. ఏడీఆర్‌వో టి.యాదగిరి, కార్యాలయ సిబ్బంది లక్ష్మణ్, వెంకటయ్య, పాష, అను, తరుణ్, శ్రీనివాసులు, ఎల్లయ్య, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంటల ఎదుగుదలకు జీవ ఎరువులు ఉపయుక్తం

బిజినేపల్లి, ఫిబ్రవరి 8 : పంటల ఎదుగుదల జీవ ఎరువుల వినియోగం ఉపయుక్తంగా ఉంటుందని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏజీ బీఎస్సీ 4వ సంవత్సరం చదువుతున్న రావేఫ్ విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని మంగనూర్‌లోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం రైతులకు జీవ ఎరువుల్లోని సూక్ష్మజీవులతో కలిగే లాభాలను రావేఫ్ విద్యార్థినులు ప్రత్యక్ష అనుభవం ద్వారా అవగాహన కల్పించారు. ఒకే పంటను సంవత్సరాల పాటు సాగు చేయడం ద్వారా పంటకు మేలు చేసే సూక్ష్మజీవుల సంఖ్య తగ్గి పంట నాణ్యత, దిగుబడి తగ్గి రైతులకు నష్టాలు వస్తున్నట్లు తెలిపారు. రావేఫ్ విద్యార్థినులు నిహారీక, ప్రణయ, వైష్ణవి, వైష్ణవి రెడ్డి, నివేదిత తదితరులు ఉన్నారు.

● తిమ్మాజిపేట: వరి పంటలో వచ్చే పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రావేఫ్ విద్యార్థినులు జయశ్రీ, శ్రీజ, అంకిత, శృతి, సపురలు రైతులకు సూచించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ గ్రామపంచాయతీ ముందు రచ్చకట్ట దగ్గర వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రావేఫ్ విద్యార్థినులు గురువారం అవగాహన కల్పించారు. పటం ద్వారా జాగ్రత్తలను రాయడమే కాకుండా చదివి విన్పించారు. సింగిల్ విండో డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రామేశ్వర్

మన్ననూర్, ఫిబ్రవరి 8: మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అడిషినల్ ఎస్పీ రామేశ్వర్ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో షీటీమ్ సభ్యులతో కలిసి గురువారం విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని, ఏ సందర్భంలో నైనా లైంగిక వేధింపులు, అశ్లీల మాటలతో వేధించడం వంటి చలకు పాల్పడే వారిపై పోక్సో చట్టప్రకారం కఠిన శిక్షలు అమలు చేస్తామని తెలిపారు. షీటీం ఇన్‌చార్జి ఎస్ఐ విజయలక్ష్మి, అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ నరేష్ , గురుకులం ప్రిన్సిపల్ రూపాదేవి పాల్గొన్నారు.